క్లుప్తంగా

ఆలయ పరిసరాల్లో ఈవో తనిఖీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు మంగళవారం ఆలయ పరిసరాల్లోని పలు కౌంటర్లు, క్యూలైన్లు, ప్రసాదాల విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. భక్తులు అమ్మవారి దర్శనానికి విచ్చేసే క్యూలైన్లను పరిశీలించిన ఈవో శానిటేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. క్యూలైన్లలో స్టీల్ గేట్లకు భక్తులు కట్టిన దారాలు, తాళ్లను వెంటనే తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. క్యూలైన్ల మధ్యలో భక్తులు తాగేందుకు అందుబాటులో ఉంచిన మంచినీటిని పరిశీలించారు. చీరల కౌంటర్‌లో భక్తులకు ఇస్తున్న రశీదులను తనిఖీ చేశారు. అనంతరం దుర్గా ఘాట్‌కు చేరుకున్న ఈవో స్నానఘాట్‌లో శానిటేషన్‌పై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్తిక పుణ్యస్నానాలకు పెద్ద ఎత్తున భక్తులు, భవానీలు, అయ్యప్పలు, శివదీక్షాపరులు వస్తున్నందున ఘాట్ మెట్లపై ఎటువంటి చెత్త లేకుండా చూడాలని ఆదేశించారు. శానిటేషన్ సిబ్బంది విధుల పట్ల ఎటువంటి అలసత్వం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 47 మందికి జరిమానా



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు నగరంలో వివిధ ప్రాంతాలలో మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 47 మంది మద్యం తాగి వాహనాలు నడిపే చోదకులను మూడవ ట్రాఫిక్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి ఏడవ అడిషనల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్ట్‌లో హాజరుపర్చగా న్యాయమూర్తి కె.సురేష్ బాబు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ప్రతి రోజు నగరంలో డ్రంకెన్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని, వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని సీపీ టీకే రాణా హెచ్చరించారు.

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఓటరుగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని విజయవాడ జోనల్ కమిషనర్ డాక్టర్ రవిచంద్ర అన్నారు. పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ విభాగం, నగరపాలకసంస్థ ఎలక్షన్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ రవిచంద్ర మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు చాలా కీలకమైన సాధనమన్నారు. ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదైనప్పుడు ప్రజాస్వామ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. వీఎంసీ రెవెన్యూ అదనపు కమిషనర్ డీపీ లక్ష్మి, డెప్యూటీ సిటీ ప్లానర్ కేవీ భాస్కర్ బాబు తదితరులు మాట్లాడుతూ ఓటరుగా ఎలా నమోదు కావాలనే అంశాలను వివరించారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

3 న ఘంటసాల సినీ పాటల పోటీలు

విజయవాడ కల్చరల్: శ్రీధర్స్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై డిశంబరు 3 వ తేదీన ఘంటసాల వెంకటేశ్వరరావు సినీ పాటల పోటీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు గెద్దం మంగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్, సీనియర్ విభాగాలలో పోటీలు జరుగుతాయని, విజేతలకు నగదు బహుమతి అందజేస్తామన్నారు. ఘంటసాల పాటలు మాత్రమే పాడాలని ఏ విధమైన ప్రవేశ రుసుము లేదని, వివరాలకు 833 192 7473 లో సంప్రదించాలన్నారు.

10న క్షత్రియ వన సమారాధన

మధురానగర్(విజయవాడసెంట్రల్): వచ్చే నెల 10వ తేదీ ఆదివారం క్షత్రియ సేవాసంఘం ఆధ్వర్యాన క్షత్రియ కుటుంబ వన సమారాధన నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాగి నరసింహ రాజు, ఉద్దరాజు విజయరామరాజు తెలిపారు. స్థానిక అయోధ్యనగర్ అద్దేపల్లి వెంకట సుబ్బరాజు క్షత్రియ భవన్‌లో మంగళవారం క్షత్రియ కుటుంబ వన సమారాధన కరపత్రాల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తూరు తాడేపల్లిలోని పిన్నంరాజు సత్యనారాయణరాజు మామిడి తోటలో క్షత్రియ కుటుంబ వన సమారాధన ఏర్పాటు చేశామన్నారు. వన సమారాధన కార్యక్రమంలో భాగంగా 25 మంది డాక్టర్‌లకు సత్కారం చేయనున్నట్లు తెలిపారు. ప్రథమ ఆహ్వానపత్రికను సంఘం గౌరవాధ్యక్షుడు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజుకు అందజేసి ఆశీస్సులు తీసుకున్నామన్నారు. క్షత్రియులందరూ వనసమారాధనలో పాల్గొనాల్సిందిగా వారు కోరారు.

పూలే ఆశయాలను ఆచరిస్తున్న సీఎం జగన్

పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహాత్మా జ్యోతీరావు పూలే ఆశయాలను ఆచరిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. భవానీపురంలో గల ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం మహాత్మా జ్యోతీరావుపూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత జ్యోతీరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహాత్మా జ్యోతీరావు పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. నాడు పూలే విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని, నేడు సీఎం వైఎస్ జగన్ అదే దారిలో నడుస్తూ విద్యారంగానికి పెద్ద పీట వేశారన్నారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తున్నారన్నారు. విద్యను ప్రోత్సహించేందుకు అమ్మ ఒడి పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని భావించి ఆ దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. ప్రభుత్వ బడులను కార్పొరేట్‌గా దీటుగా తీర్చిదిద్దారన్నారు.

లోకేష్ రాజకీయాల్లో కమెడియన్

రాజకీయాల్లో లోకేష్ పెద్ద కమెడియన్ అని వెలంపల్లి అన్నారు. చాలా రోజుల విరామం తర్వాత మళ్లీ కమెడియన్ యాత్ర ప్రారంభించారన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను చంద్రబాబు కాపీ కొడుతున్నారన్నారు. ఈ రాష్ట్ర ప్రజలు బాబును నమ్మే పరిస్థితిలో లేరన్నారు. మళ్లీ ఈ రాష్ట్రానికి వైఎస్ జగన్ సీఎం కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు యలకల చలపతిరావు, ఇర్ఫాన్, కోటిరెడ్డి, ఆంజనేయ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మైలవరపు కృష్ణ , బీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు డేరంగుల రమణ, మజ్జి శ్రీదేవి, సైకం సాయిబాబు, మంజు భార్గవి, భట్టిపాటి శివ, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు గౌస్ మొహిద్దీన్, తనుబుద్ధి చంద్ర శేఖర్ రెడ్డి, కేసరి చిన్న సుబ్బారెడ్డి, కట్ట సత్తయ్య, జీఎంసీ బాషా, గోలగాని శ్రీనివాసరావు, యూనస్, బెవర నాగేశ్వర రావు, పెద్ది రాజారావు, కొరగంజి భాను, పోలిమెట్ల శరత్ పాల్గొన్నారు.



జ్యోతీరావుపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



జ్యోతీరావు పూలేకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్సార్ సీపీ నాయకులు



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బెజ్జం రవికుమార్, నాగుల్‌మీరా

నవయుగ వైతాళికుడు జ్యోతీరావు పూలే

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దేశంలో అక్షర జ్యోతిని వెలిగించిన మహనీయుడు మహాత్మా జ్యోతీరావు పూలే అని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. పూలే స్ఫూర్తితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా వర్గాల అభ్యున్నతికి ఎంతగానో దోహదపడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీ మూర్తి, పరసా శ్రీను, కృష్ణమోహన్, కొప్పవరపు మారుతీ, విక్రమ్ నాగు, ఆర్ఎస్ నాయుడు, లంకా బాబు తదితరులు పాల్గొన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న పూలే విగ్రహం వద్ద మాజీ వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షేక్ నాగుల్‌మీరా ఆధ్వర్యంలో పూలే వర్ధంతి నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి బెజ్జం రవికుమార్ విచ్చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోలిమెట్ల శరత్‌బాబు, సెంట్రల్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గుడిసె శ్యామ్, శివకోటి మధు, ఎస్సీ సెల్ నాయకులు బత్తుల సుబ్బారావు, బెనర్జీ, సురేష్‌బాబు, ప్రసాద్ వర్మ తదితరులు పాల్గొన్నారు. ఏపీ పీటీడీ(ఆర్టీసీ) బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శేషగిరిరావు జ్యోతీరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళలు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.



జ్యోతీరావు పూలేకు నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నేతలు

కార్యక్రమంలో బీసీ నాయకులు ఏవీఎస్ఎన్ ప్రసాద్, ఎం.మోజెస్, జి.ఆంజనేయులు, బి.శ్రీనివాస్, పి.వెంకటేశ్వరరావు, టి.పూర్ణయ్య, ఎస్. యశోద, దుర్గ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలేకు ఘన నివాళి

జ్యోతీరావు పూలే ఆశయ సాధనకు కృషి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహాత్మా జ్యోతీరావు పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఎన్వీ రావు అన్నారు. కేఎల్‌రావు నగర్‌లోని బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం జ్యోతీరావు పూలే 133వ వర్ధంతిని నిర్వహించారు. తొలుత జ్యోతీరావు పూలే చిత్రపటానికి పలువురు బీసీ నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. మహాత్మా జ్యోతీరావు పూలే ఆశయాలు విద్య ద్వారా నెరవేరుతాయని, అటువంటి విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి సామాజిక సాధికారత, ఆర్థిక సమానత్వం, తద్వారా దేశ అభివృద్ధి జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి నమ్మి అప్పారావు, కోశాధికారి అవ్వారు బుల్లబ్బాయ్, ప్రధాన కార్యదర్శి బాయన శేఖర్‌బాబు, కృష్ణా జిల్లా నగరాల సంఘం అధ్యక్షుడు అడ్డూరి రాము, మల్లేశ్వరి, సురేఖ, ఉమా, రాజేశ్వరి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భవానీపురం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చర్చి సెంటర్‌లోని మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహం వద్ద పూలే వర్ధంతి నిర్వహించారు.



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ భాగ్యలక్ష్మి



పూలేకు నివాళులర్పిస్తున్న మరుపిళ్ల రాజేష్ తదితరులు

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి విచ్చేసి పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భవానీపురం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బెవర నాగేశ్వర రావు, అధ్యక్షుడు మాదల తిరుపతిరావు, కార్యదర్శి ఎస్వీ శేషగిరిరావు, ప్రసాద్, పి. వెంకటేశ్వరరావు, రాజా, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పూలే సేవలు అపూర్వం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలోని బలహీన వర్గాల అభ్యున్నతికి మహాత్మా జ్యోతీరావు పూలే అందించిన సేవలు అపూర్వమని 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ అన్నారు. మహాత్మ జ్యోతీరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని మరుపిళ్ల రాజేష్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. రాజేష్ తదితరులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ సమాజంలో అసమానతలు రూపుమాపేందుకు పూలే అలుపెరుగని పోరాటం చేశారన్నారు. బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళల సామాజిక సాధికారత కోసం పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం గురుమహంతు మహేష్ పాల్గొన్నారు.

మహాలక్ష్మీ అమ్మవారికి పంచామృత అభిషేకాలు

- అఖండ దీపస్థాపన, కలశస్థాపన
- వైభవంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీనగరాల మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థాన చతుర్థ బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో విఘ్నేశ్వర పూజతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాగా, అమ్మవారి ఉత్సవ మూర్తికి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావులతో పాటు ఉభయదాతలు వెంకట బుజ్జి కిరణ్, జయవాణి దంపతులచే అభిషేక కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు నుదురుపాటి ప్రసాద్‌శర్మ, రెంటచింతల విశ్వనాథ్‌లతో పాటు ఇతర అర్చకులు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేష అలంకరణ, పూజాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారి ఉత్సవ మూర్తి వద్ద అఖండ దీపస్థాపన, కలశ స్థాపన, షోడశోపచార పూజలు, అగ్ని ప్రతిష్టాపన, కంకణధారణ, నవగ్రహ, వాస్తు, మండపారాధన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సాయంత్రం సహస్రమోదక లక్ష్మీ గణపతి హోమం, అమ్మవారికి పంచహారతుల సేవ నిర్వహించారు.



అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

నేడు చండీహోమం, లక్ష పుష్పార్చన

బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండో రోజున అమ్మవారి ఆలయ ప్రాంగణంలో చండీహోమం, లక్ష పుష్పార్చన నిర్వహించనున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి చండీహోమం, సాయంత్రం లక్ష పుష్పార్చన జరుగుతుందని పేర్కొన్నారు.

ఉత్తమ రోటరాక్ట్ క్లబ్‌గా పీఎస్‌సీఎంఆర్ కాలేజ్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని పొట్టిశ్రీరాములు చలువాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ రోటరాక్ట్ క్లబ్ ఉత్తమ రోటరాక్ట్ క్లబ్‌గా ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ తెలిపారు. ఇటీవల జరిగిన రోటరీ క్లబ్ కార్యక్రమంలో తమ కళాశాల రోటరాక్ట్ క్లబ్‌ను ఉత్తమ విభాగంగా ప్రకటించి అవార్డు అందించినట్లు వివరించారు. తమ కళాశాల క్లబ్ 16 విభాగాల్లో ఉత్తమ అవార్డులను కైవసం చేసుకున్నారని చెప్పారు. కమ్యూనిటీ సర్వీస్, ఆప్యాయత, ఎక్కువ మోతాదులో రక్తదానం వంటి అంశాల్లో చక్కని ప్రతిభను కనబరిచినట్లు వివరించారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి పి.లక్ష్మణస్వామి అభినందించినట్లు వివరించారు.

సేవకులే కాదు పాలకులని నిరూపించిన సీఎం జగన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): నాయీ బ్రాహ్మణులంటే సమాజానికి సేవకులే కాదు పాలకులని నిరూపించేలా చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అయోధ్యనగర్ నాయీ బ్రాహ్మణుల కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం నాయీబ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం జరిగింది. తొలుత జ్యోతీరావు పూలే, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు సమాజంలో గౌరవ ప్రతిష్టలు తెచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. చంద్రబాబు నాయీబ్రాహ్మణులను తోకలు కత్తిరిస్తానంటూ అవమానించారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల ట్రస్టు బోర్డు సభ్యుల నియామకాల్లో నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి ఒకరికి తప్పనిసరిగా స్థానం కల్పించేలా గవర్నర్ ద్వారా ఆర్డినెన్స్ తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే చెప్పారు. నాయీబ్రాహ్మణులను కించపరిచే పదాలను నిషేధిస్తూ జీఓ నంబర్ 50 జారీ చేశారన్నారు.

నగరంలో జీఈఎఫ్ బృందం పర్యటన

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (యునెడో) నిధులతో ఆధునీకరిస్తున్న ఎస్టీపీ(సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)లను పరిశీలించేందుకు గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ఫెసిలిటీ (జీఈఎఫ్) బృందం వచ్చింది. విజయవాడ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో జీఈఎఫ్ యునిడో ప్రతినిధులకు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నగర పాలక సంస్థ మురుగునీటి శుద్ధికి తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ గురించి వివరించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో జరిగిన ఈ సమావేశంలో కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (యునెడో) సస్టైనబుల్ సిటీస్ ఇంటిగ్రేటెడ్ అప్రోచ్ పైలెట్ ప్రాజెక్టు (ఎస్‌సీఐఏపీ)లో భాగంగా సుమారు రూ.12 కోట్లతో విజయవాడ నగరపాలక సంస్థ నగర పరిధిలో ఉన్న ఎస్టీపీలు, డ్రైనేజ్ పంపింగ్ స్టేషన్లను అభివృద్ధిపరిచామని, పర్యావరణ హితమైన బయోగ్యాస్ ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేసి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు అనుగుణంగా కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో, బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్ స్థాయిలను తగ్గించడంలో ఈ ప్రాజెక్ట్ ప్రభావాన్ని చూపుతుందని జీఈఎఫ్ బృందానికి వివరించారు. అనంతరం పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ (పీపీపీ) విధానంలో కొనసాగుతున్న, రానున్న ప్రాజెక్టుల గురించి విజయవాడ నగరపాలక సంస్థ రాజీవ్ గాంధీ పార్క్, ఈ3, తదితర ప్రాజెక్టులను ఈ బృందం పరిశీలించింది. నగరంలోని ఎస్టీపీలను సందర్శించింది. ఈ సమావేశంలో గ్లోబల్ ఎన్విరాన్మెంట్ ఫెసిలిటీ జీఈఎఫ్ సీనియర్ ఎవల్యూషన్ అధికారి నీరజ్ కుమార్ నెగి, ఇంటర్నేషనల్ ఎక్స్పర్ట్ ఆఫ్ పబ్లిక్ ప్రైవేట్ పార్టిసిపేషన్ ఎట్ ఇండిపెండెంట్ ఇవాల్యుయేషన్ ఆఫీస్ అధికారి అలెగ్జాండర్ ఫ్రాన్సిస్ బర్గర్, ఎస్‌సీఐఏపీ సీనియర్ టెక్నికల్ అడ్వైజర్ నందపాల్ సింగ్, అర్బన్ టెక్నాలజీ అండ్ ఇన్వెస్ట్మెంట్ స్పెషలిస్ట్, (విజయవాడ, గుంటూరు) సిటీ కోఆర్డినేటర్, ఇండియా, వెంకట రమణారావు పెర్కారి, వీఎంసీ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.



జీఈఎఫ్ బృందంతో సమీక్షిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నాటక రంగానికి పూర్వవైభవం తేవాలి

విజయవాడకల్చరల్: తెలుగు నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావాలని కృష్ణాజిల్లా వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుమ్మడి విజయకుమార్ అన్నారు. గుమ్మడి జయరాజ్ కళాపీఠం ఆధ్వర్యంలో గుమ్మడి రత్నకిషోర్ ఆరవ వర్ధంతి సందర్భంగా గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై జరిగిన కార్యక్రమంలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ తెలుగు నాటక రంగాన్ని మలుపు తిప్పిన మహనీయుడు జయరాజ్ అని, ఆయన స్ఫూర్తితో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాపోషకుడు రాచూరి శివరావు మాట్లాడుతూ జయరాజ్ కళాపీఠం సేవలను అభినందించారు. గుమ్మడి జయరాజ్ కళాపీఠం ప్రధాన కార్యదర్శి గుమ్మడి అన్వేష్ సంస్థ లక్ష్యాలను వివరించారు. గుమ్మడి జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో చింతలపూడి నాగేశ్వరరావు, మోటా ఆంథోనిని నిర్వాహకులు సత్కరించారు. రాజరాజేశ్వరి నాట్యమండలి, గుమ్మడి జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో కణశ్రీ రచించిన బాలనాగమ్మ పద్యనాటకాన్ని ప్రదర్శించారు. కార్యవర్ధిరాజుగా నీలపూడి రంగారావు, బాలవర్ధిరాజుగా జీవన్‌కుమార్, బాలనాగమ్మగా విజయలక్ష్మి నటించారు.



రంగస్థల ప్రముఖులు నాగేశ్వరరావు, ఆంథోనిలను సత్కరిస్తున్న నిర్వాహకులు

నవగ్రహ మండప నిర్మాణ పనుల పరిశీలన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న నవగ్రహ మండపం పనులను మంగళవారం దేవదాయ శాఖ స్థపతి పరమేశ్వరప్ప పరిశీలించారు. తొలుత ఆలయ ఈవో రామారావును కలిసి అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం ఈవో రామారావు, పరమేశ్వరప్ప, ఈఈ కోటేశ్వరరావు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు మల్లేశ్వరాలయం అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు తుది దశకు చేరుకోవడంతో మిగిలి ఉన్న పనులు కూడా త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న నవగ్రహ మండపం పనులపై చర్చించారు. గతంలో ఉన్న ప్రదేశంలోనే నవగ్రహ మండపం నిర్మించాలని ఆలయ ఇంజినీరింగ్ అధికారులు నిర్ణయించడంతో ఆ ప్రదేశంలో చేసిన మార్కింగ్‌ను స్థపతి పరిశీలించారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభం అయ్యే అవకాశం ఉందని ఆలయ ఇంజినీరింగ్ అధికారులు పేర్కొన్నారు.



పనుల పురోగతిపై చర్చిస్తున్న స్థపతి పరమేశ్వరప్ప, ఈవో రామారావు, ఈఈ కోటేశ్వరరావు

డిసెంబర్ 22, 23 తేదీల్లో భగవద్గీత కంఠస్థ పోటీలు

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో డిశంబరు 22, 23 తేదీల్లో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఎన్టీఆర్ జిల్లా ప్రోగామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ తెలిపారు. పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణమండపంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ప్రతి ఏడాది మార్గశిర శుద్ధ ఏకాదశి గీతా జయంతి సందర్భంగా భగవద్గీత పోటీలను నిర్వహిస్తామని, ఈ ఏడాది డిశంబరు 22, 23 తేదీల్లో సత్యనారాయణపురంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో 6 నుంచి 9 వ తరగతి విద్యార్థులకు కర్మ యోగం అధ్యాయంలో 1 నుంచి 30 శ్లోకాల వరకు కంఠస్థ పోటీలు, 23 వ తేదీ ఇదే వేదికమీద సంపూర్ణ భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు. సమావేశంలో టీటీడీ కల్యాణమండపం మేనేజర్ భాస్కరరెడ్డి, జిల్లా ధార్మిక కమిటీ సభ్యులు బి.వెంకట బాల కోటేశ్వరరావు, నండూరి తాండవ కృష్ణ, టీటీడీ వేద పండితులు మంగిపూడి వెంకట శాస్త్రి, శ్రీవారి సేవకులు విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. వివరాలకు సీవీకే ప్రసాద్ 703 2255 499 నంబరులో సంప్రదించాలని ప్రవేశ రుసుము లేదని ఉచితంగా పాల్గొనవచ్చని తెలిపారు.



భగవద్గీత పోటీల పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీవీకే ప్రసాద్, నండూరి తాండవ కృష్ణ, బాల కోటేశ్వరరావు

మానవ జీవనంపై భౌతిక శాస్త్ర ప్రభావం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం డి.పి. సోమయాజి మెమోరియల్ ట్రస్ట్, భౌతిక శాస్త్రం –ఎలక్ట్రానిక్స్ శాఖ ఆధ్వర్యాన 'పుట్టుక నుంచి మరణం వరకు భౌతిక శాస్త్ర ప్రభావం' అనే అంశంపై అతిథి ఉపన్యాసం జరిగింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అశ్విన్‌కుమార్ పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా వైద్య శాస్త్రంలో భౌతిక శాస్త్రంకు సంబంధించి వివిధ వైద్య పరికరాలు, పనిచేసే సూత్రం వాటి ఉపయోగం గురించి వివరించారు.

జ్యోతీరావు పూలే ఆశయసాధనకు కృషి

మధురానగర్(విజయవాడసెంట్రల్): బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. సత్యనారాయణపురం భగత్‌సింగ్ రోడ్డులోని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్యాలయంలో మంగళవారం మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పూలే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 61వ డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, నాయకులు కమ్మిలి రత్నకుమార్, జి.దత్తు, ఓడిగు దుర్గారావు, వర్మ, రాజేష్, గౌరైల దుర్గాప్రసాద్, యు.స్వామి, పొన్నాడ గంగాధర్, వి.దుర్గారావు, ఎం.సూర్య ప్రకాష్, ఎం.కోటి తదితరులు పాల్గొన్నారు

ఠాగూర్ గ్రంథాలయంలో...

మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి పురస్కరించుకుని ఠాగూర్ గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమల పూర్ణమ్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, సిబ్బంది పాఠకులు పాల్గొన్నారు

10న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరం ఆలయకమిటీ ఆధ్వర్యాన వచ్చేనెల 10వ తేదీ ఆదివారం లోక కల్యాణార్థం నున్న మామిడి తోటలో కార్తిక వన సమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వన సమారాధనలో స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సామూహిక రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు ఆలయంలో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.